వాయిస్ టుడే

సోమవారం, సెప్టెంబరు 14, 2026



## ఖమ్మం గడ్డపై మారుమోగిన

# జనసేన శంఖారావం

### వేలాదిగా తరలివచ్చిన జనసైనికులు, వీర మహిళలు.. ఘనంగా బైక్ ర్యాలీ, సభ

### నిబద్ధత గల నాయకత్వమే తెలంగాణకు అవసరం: తాళ్లూరి రామ్

### తెలంగాణ ఎవరి జాగీరు కాదు.. ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు: నేమూరి శంకర్‌గౌడ్

### ఈ విజయం మనందరిది.. మన ఐక్యతే మన బలం: గడల శ్రీనివాసరావు

ఖమ్మం, సెప్టెంబర్ 13:లి ఖమ్మం జిల్లా కేంద్రంలో జనసేన పార్టీ నిర్వహించిన 'తెలంగాణ శంఖారావం' సభ అట్టహాసంగా జరిగింది. ఎంబీ ఫంక్షన్ హాల్‌లోని 'పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం' వేదికగా జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర నలుమూలల నుంచి వేలాదిమంది జనసైనికులు, వీర మహిళలు, యువత తరలివచ్చారు. ఖమ్మం నగర వీధుల్లో 'జై జనసేన' నినాదాలు మారుమోగాయి. సభకు ముందు ఖమ్మం ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. వేలాదిమంది జనసైనికులు, యువత పాల్గొన్న ఈ ర్యాలీ ఖమ్మం బైపాస్ రోడ్డు మీదుగా కొనసాగి ఎంబీ ఫంక్షన్ హాల్‌లోని 'పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం'కు చేరుకుంది. జనసేన పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అధికార ప్రతినిధి డా. గడల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. సభలో జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్, ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు, జనసేన నాయకులు తనీష్ అల్లాడి, రాధారం రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

**బాలికకు నివాళి**

హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఇటీవల దారుణ హత్యకు గురైన అశ్వారావుపేట నియోజకవర్గం, ములకలపల్లి మండలం చౌటప్పగూడెం గ్రామానికి చెందిన బాలికకు సభలో ఘనంగా నివాళులర్పించారు. బాలిక మృతికి సంతాపంగా సభా ప్రాంగణంలో కొద్దిసేపు మౌనం పాటించారు. అనంతరం జనసేన నాయకులు బాలిక కుటుంబాన్ని పరామర్శించి సంతాపం తెలిపారు.

**వనజీవి రామయ్య సేవలకు గౌరవం**

'పద్మశ్రీ వనజీవి రామయ్య ప్రాంగణం' వేదికగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ వనజీవి రామయ్య సేవలను జనసేన నాయకులు స్మరించుకున్నారు. ఆయన సతీమణిని ప్రత్యేకంగా ఆహ్వానించి వేదికపై ఘనంగా సత్కరించారు. వనజీవి రామయ్య పర్యావరణ పరిరక్షణకు చేసిన సేవలకు జనసేన పార్టీ తరపున గౌరవాన్ని తెలియజేశారు.

**సభ విజయవంతం కావడంతో ఖమ్మం నగరంలో జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. 'జై జనసేన.. జై పవన్ కళ్యాణ్.. జై తెలంగాణ' నినాదాలతో సభా ప్రాంగణం మారుమోగింది.**





### నిబద్ధత గల నాయకత్వం అవసరం: తాళ్లూరి రామ్



జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ మాట్లాడుతూ జనసేన పార్టీ ఎప్పటికీ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తుందని అన్నారు. జనసేనను అడ్డుకునేందుకు ఎన్ని కుట్రలు చేసినా ప్రజల మద్దతుతో పార్టీని ఆపడం ఎవరి తరం కాదన్నారు. రాష్ట్రానికి నిబద్ధత కలిగిన నాయకత్వం అవసరమని పేర్కొన్నారు.

### తెలంగాణ ఎవరి జాగీరు కాదు: నేమూరి శంకర్‌గౌడ్



జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి నేమూరి శంకర్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఎవరి జాగీరు కాదని అన్నారు. ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో ప్రతి ఒక్కరికీ సమాన హక్కులు, సమాన న్యాయం దక్కాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జనసేన క్రియాశీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.

### ఈ విజయం మనందరిది: గడల శ్రీనివాసరావు



జనసేన ఉమ్మడి ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి, అధికార ప్రతినిధి డా. గడల శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ శంఖారావం సభ, భారీ బైక్ ర్యాలీని విజయవంతం చేసేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు, యువత, వాలంటీర్లు, డిజిటల్ బృందాలు, అభిమానులు, ప్రజలు, మీడియా ప్రతినిధులు, పోలీస్ శాఖ అందించిన సహకారాన్ని అభినందించారు. "ఈ విజయం నాది కాదు.. మనందరిది. మన ఐక్యతే మన బలం. ఖమ్మంలో మోగిన శంఖారావం ఇక తెలంగాణ అంతటా ప్రతిధ్వనించాలి"లి అని గడల శ్రీనివాసరావు అన్నారు.

**తెలంగాణలో క్రియాశీలక పాత్ర: సాగర్ ఆర్.కె. నాయుడు**

జనసేన పార్టీ ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ తెలంగాణలో జనసేన పార్టీ మరింత క్రియాశీలకంగా పనిచేయబోతోందని తెలిపారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని పేర్కొన్నారు.



